సాక్షి రాజన్న సిరిసిల్ల

మంగళవారం। 28 । నవంబర్ । 2023



వైభవంగా జ్వాలాతోరణం

వేములవాడ: రాజన్న ఆలయంలో సోమవారం రాత్రి జ్వాలాతోరణం వైభవంగా నిర్వహించారు.



పోస్టల్ బ్యాలెట్ సమస్య పరిష్కరించండి

సిరిసిల్లటౌన్/వేములవాడ: : పోస్టల్ బ్యాలెట్ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ డీటీఎఫ్ నాయకులు ఎన్నికల రిటర్నింగ్ అధికారులకు వినతిపత్రాలు ఇచ్చారు.

గరిష్టం/కనిష్టం
29.0/21.0

వాతావరణం

ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. జిల్లాలో అక్కడక్కడ వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. చలిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

నేడు సిరిసిల్లలో కేటీఆర్ రోడ్ షో



మంత్రి కేటీఆర్

సిరిసిల్ల: సిరిసిల్ల జిల్లాకేంద్రంలో మంగళవారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర మంత్రి, స్థానిక ఎమ్మెల్యే కె.తారక రామారావు రోడ్ షో నిర్వహించనున్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా జిల్లాకేంద్రంలోని అంబేడ్కర్ సర్కిల్ వద్ద జరిగే రోడ్‌షోలో కేటీఆర్ పాల్గొని మాట్లాడుతారు. రోడ్‌షోను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ నాయకులు ఏర్పాట్లు చేశారు. మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు జరిగే రోడ్‌షోకు పట్టణంలోని 39 వార్డుల నుంచి భారీగా జనాన్ని సమీకరించాలని బీఆర్ఎస్ నాయకులు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఈమేరకు తెలంగాణ భవన్‌లో అన్ని వార్డుల కౌన్సిలర్లు, వార్డు అధ్యక్షులతో పార్టీ నాయకులు చీటి నర్సింగరావు, గూడూరి ప్రవీణ్, తోట ఆగయ్య, జిందం చక్రపాణి, దార్నం లక్ష్మీనారాయణ, బొల్లి రామ్మోహన్, అగ్గి రాములు, మ్యాన రవి, సత్తార్, అన్నల్‌దాస్ వేణు సమావేశమయ్యారు.

జిల్లాలో 1,676 మంది పోస్టల్ బ్యాలెట్ వినియోగం

సిరిసిల్ల: జిల్లాలో సోమవారం వరకు ఎన్నికల విధుల్లో ఉన్న సిబ్బంది 1,676 మంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఫెసిలిటేషన్ కేంద్రాలలో ఓటుహక్కు వినియోగించుకున్నారు. అత్యవసర సర్వీసులో ఉన్న సిబ్బంది 39 మందికి ఏడుగురు ఓటుహక్కు వినియోగించుకున్నారు. ఈనెల 29వ తేదీ వరకు సిరిసిల్ల, వేములవాడ ఫెసిలిటేషన్ కేంద్రాలలో ఎన్నికల విధుల్లో ఉండే సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటుహక్కు వినియోగించుకునేందుకు కేంద్ర ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది.

సమాజాన్ని కదిలించే కవిత్వం రావాలి

- తెలంగాణ రయితల వేదిక అధ్యక్షుడు జూకంటి జగన్నాథం
- ఎ'లక్షణం' పుస్తకావిష్కరణ



సిరిసిల్లలో ఎ'లక్షణం' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కవులు

సిరిసిల్ల: సమాజాన్ని కదిలించే శక్తివంతమైన, ప్రజాజీవితాలను ప్రభావితం చేసే కవిత్వం రావాలని అఖిల భారత తెలంగాణ రచయితల వేదిక అధ్యక్షుడు జూకంటి జగన్నాథం కోరారు. సీనియర్ జర్నలిస్ట్, కవి, రచయిత కోడం పవన్‌కుమార్ రచించిన ఎ'లక్షణం' కవితా సంకలనాన్ని జిల్లా కేంద్రంలో సోమవారం జిల్లా ఇంటలెక్చువల్ ఫోరం ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. సాహితీవేత్త పిన్నంశెట్టి కిషన్ మాట్లాడుతూ పవన్‌కుమార్ కవిత్వంలో ప్రగతిశీల భావాలుంటాయన్నారు. ఎ'లక్షణం' కవిత సంకలనంలో వర్తమాన పరిస్థితులపై కదిలించే కవిత్వం ఉందన్నారు. తెలంగాణ రచయితల వేదిక రాష్ట్ర కార్యదర్శి ఆడెపు లక్ష్మణ్, కవి, గాయకుడు వెంగళి నాగరాజు, డాక్టర్ చిటికెన కిరణ్‌కుమార్, జనపాల శంకరయ్య, కోడం నారాయణ పాల్గొన్నారు.

అఖిలపక్షం నాయకుల ఆందోళన



ముస్తాబాద్‌లో ఆందోళనకు దిగిన అఖిలపక్షం నాయకులు

ముస్తాబాద్(సిరిసిల్ల): ముస్తాబాద్ అంబేడ్కర్ విగ్రహం ఎదుట అఖిలపక్షం నాయకులు సోమవారం నిరసన తెలిపారు. పోతుగల్‌లో బీఆర్ఎస్ నాయకులు తనపై దాడి చేశారంటూ కావటి మహిపాల్ ఆరోపించారు. అధికార పార్టీ బీఆర్ఎస్ ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని ప్రచారం చేసినందుకే తనపై కొందరు ఆ పార్టీ నాయకులు దాడి చేశారన్నాడు. ఈ సంఘటనపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా.. పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. కావటి మహిపాల్‌కు కాంగ్రెస్ మండలాధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి, బీఎస్పీ సిరిసిల్ల అభ్యర్థి పిట్టల భూమేశ్, మాజీ సర్పంచ్ ఓరుగంటి తిరుపతి, బుర్ర రాములు, శ్రీకాంత్, గజ్జెల రాజు తదితరులు సంఘీభావం తెలిపారు. ఈ విషయంపై బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ వాట్సాప్‌లో తమపై అసత్య ప్రచారం చేశారని, దీన్ని ప్రశ్నించినందుకు తమపైనే ముందుగా మహిపాల్ దాడి చేశారని తెలిపారు. దీనిపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

కమలదళంలో జోష్!

- కరీంనగర్‌ను సిల్వర్‌సిటీగా మారుస్తా
- కేంద్ర పథకాలు, నిధులను కేసీఆర్ అడ్డుకున్నారన్న ప్రధాని
- కబ్జాదారులా... మీకోసం కొట్లాడే సంజయ్ కావాలా?
- కరీంనగర్ ఎంపీ, బీజేపీ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్



అభివాదం చేస్తున్న ప్రధాని మోదీ



సభకు హాజరైన ప్రజలు

సాక్షిప్రతినిధి,కరీంనగర్/కరీంనగర్‌టౌన్: కరీంనగర్ కాషాయ దళంలో జోష్ నెలకొంది. ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం ఎస్సారార్ కళాశాల మైదానంలో బీజేపీ నిర్వహించిన సకల జనుల విజయసంకల్ప సభకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ హాజరుకావడం పార్టీ శ్రేణుల్లో రెట్టించిన ఉత్సాహాన్ని నింపింది. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని అసెంబ్లీ స్థానాలకు పోటీ చేస్తున్న అభ్యర్థులతో పాటు కార్యకర్తలు, ప్రజలు సుమారు 30 వేల మంది పాల్గొన్నారు. మోదీ మట్లాడుతున్నంతసేపు జయధ్వానాలు పలికారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ.. బీజేపీ కేంద్ర ప్రభుత్వం మొత్తం తెలంగాణ అభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. కరీంనగర్ స్మార్ట్ సిటీ కోసం మోదీ సర్కార్ నిధులు ఇచ్చినా.. కేసీఆర్ సర్కార్ అడ్డుకుందని, కేసీఆర్ కరీంనగర్‌ను లండన్ చేస్తానని తప్పుడు వాగ్దానం చేశారని పేర్కొన్నారు. బీజేపీతోనే కరీంనగర్ అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. 'కేసీఆర్ సాగునీటి పేరుతో పెద్దఎత్తున అవినీతికి పాల్పడ్డారు. కాళేశ్వరం అవినీతి గురించి తెలంగాణనే కాదు.. యావత్ దేశానికి తెలుసు. అవినీతికి పాల్పడిన బీఆర్ఎస్‌కు తగిన శిక్ష పడాలా.. వద్దా..?' అని ప్రశ్నించారు. 'కేసీఆర్ సర్కార్ చిన్న, సన్నకారు రైతుల ఉసురుపోసుకుంది.. మోదీ సర్కార్ పీఎం కిసాన్ సమ్మాన్‌నిధి సాయం చేసింది. ఉప్పుడు బియ్యం కొనుగోలు చేసింది. ఫిలిగ్రీ కళకు కరీంనగర్ ప్రసిద్ధి చెందింది. మన్ కీ బాత్ లో కూడా ప్రస్తావించాను. స్వర్ణకారులు, కళాకారుల కోసం పీఎం విశ్వకర్మ యోజన ప్రవేశపెట్టారు. దీని ద్వారా ఇక్కడి ఫిలిగ్రీ కళాకారులకు ఆధునిక ట్రైనింగ్, లక్షల రూపాయల రుణం లభిస్తుంది. కరీంనగర్‌ను సిల్వర్ సిటీగా తీర్చిదిద్దేందుకు బీజేపీ కృషి చేస్తుంది..' అన్నారు. తను వోకల్ ఫర్ లోకల్ అనేది.. కరీంనగర్ బాగు కోసమేనని స్పష్టం చేశారు.

ఎవరు కావాలో తేల్చుకోండి: బండి సంజయ్

'పేదల కోసం కష్టపడి పనిచేసిన నాలాంటోళ్లను గెలిపించకపోతే.. పేదల కోసం ఎందుకు కొట్లాడాలని నా కార్యకర్తలు ప్రశ్నిస్తే నేనేం సమాధానం చెప్పాలే..? నా భార్యాపిల్లలను చంపుతామన్న భయపడకుండా ధర్మం కోసం, ప్రజల కోసం ఇన్నాళ్లు పోరాడిన. నాకు ఓట్లేసి గెలిపించకుంటే నా భార్యాపిల్లలు ప్రశ్నిస్తే ఏమని చెప్పాలి. కరీంనగర్ ప్రజలారా ఒక్కసారి ఆలోచించండి. రాష్ట్రంలోని అన్ని వర్గాలు మీ తీర్పు కోసం ఎదురు చూస్తున్నయ్. ఒక్క చాన్స్ ఇస్తే ఐదేళ్లు మీకు సేవ చేసుకుంటా. కరీంనగర్‌కు రక్షణ కవచంగా నిలుస్తా'.. అంటూ బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్ కోరారు. 'నమ్మిన సిద్ధాంతం కోసం, కమల వికాసం కోసం ఇదే కరీంనగర్‌లో బీజేపీ కార్యక్రమాల పోస్టర్లను గోడలకు అంటించిన. జాతీయ, రాష్ట్ర నాయకులొస్తే స్వాగతం పలకడానికి, కార్యక్రమాలు నిర్వహించేందుకు కరీంనగర్‌లో పార్టీ జెండాలు కట్టిన సామాన్య కార్యకర్తను. మీరు పెంచి పోషించిన కార్యకర్త. ఆ రోజు అర్బన్ బ్యాంక్ డైరెక్టర్‌గా గెలిపిస్తే, ఈనాడు మీ అందరి ఓట్లతో ఎంపీగా గెలిచిన వ్యక్తిని. నేను ఏనాడూ మా నాన్న పేరు చెప్పి రాజకీయాల్లోకి రాలేదు. నమ్మిన సిద్ధాంతం కోసం, సమాజాన్ని సంఘటితం చేసేందుకు రాజకీయాల్లోకి వచ్చి మీ ముందు నిలబడ్డా. చాలా మంది అంటుంటారు.. బండి సంజయ్ ఏం చేశారని. వాళ్లకు చెప్పండి.. 9 వేల కోట్ల నిధులు తీసుకొచ్చా. మీ అందరూ వ్యాక్సిన్ తీసుకున్నారు కదా.. ఎవరిచ్చారు? బియ్యం ఎవరిచ్చారు..? కరీంనగర్ అభివృద్ధికి రూ.9 వేల కోట్లు ఇచ్చిందెవరు? స్మార్ట్‌సిటీ నిధులు, గ్రామీణ సడక్ యోజన నిధులు, జాతీయ రహదారులిచ్చిందెవరు? ఈ దేశ అభివృద్ధికి నిధులిచ్చిందెవరు.. అలాంటి మహనీయుడికి నిలబడి చప్పట్లతో స్వాగతం పలకండి' అని సంజయ్ కోరడంతో అందరూ లేచి నిలబడి స్వాగతం పలికారు. తాను ఏనాడూ సంపాదన, కుటుంబం గురించి ఆలోచించలేదన్నారు. 'డబ్బు ఆశ ఉంటే నేను మీకోసం కొట్లాడి జైలుకు పోకపోయేవాడిని కాదు. నామీద ఆరోపణలు చేసిన నేతల్లారా.. నేను అవినీతికి పాల్పడ్డట్లు రుజువు చేస్తే తన ఆస్తి మొత్తం కరీంనగర్ అసెంబ్లీ ప్రజలకు రాసిస్తా.. ప్రమాణం చేసి చెబుతున్నా.. దమ్ముంటే డాక్యుమెంట్లు తీసుకురండి. డబ్బు సంపాదన ఉంటే బండి సంజయ్ రెండు సార్లు జైలుకు వెళ్లడు.. ఏ రోజు నా కు కష్టమొచ్చినా, ఇబ్బంది వచ్చినా నా వెనుక మోదీ ఆశీర్వాదం ఉంది. నా భుజం తట్టి ప్రోత్సహించారు. మీకోసం కొట్లాడితే 74 కేసులు పెట్టారు. మీకోసం ప్రాణత్యాగానికి వెనుకాడను. దయచేసి కరీంనగర్‌లో పోటీ చేస్తున్న ముగ్గురు అభ్యర్థులను బేరీజు వేయండి. ఎవరు భూకబ్జాలకు పాల్పడుతున్నారు. ఎవరి కష్టార్జితంతో కరీంనగర్‌లో ఇట్లాంటి వాతావరణం చేశారో ఆలోచించండి..'



ప్రధాని మోదీకి జ్ఞాపిక అందిస్తున్న ఎంపీ సంజయ్

రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిన కేసీఆర్: బండి

'రాష్ట్రాన్ని కేసీఆర్ నాశనం చేసిండు. డబుల్ బెడ్రూం, ఉద్యోగాల పేరుతో అందరినీ మోసం చేశాడు. 6 లక్షల కోట్ల అప్పుల పాల్జేశారు. ఏ విధంగా మళ్లీ వాటిని పూడుస్తారు. కాంగ్రెస్ ఎట్లా అభివృద్ధి చేస్తుంది? ఎట్లా జీతాలు ఇస్తుంది? అందుకే బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం. డబుల్ ఇంజిన్ సర్కార్‌తోనే అప్పులు తీరి సుస్థిర పాలనతో అభివృద్ధి చేయడం సాధ్యం. ఎమ్మార్పీఎస్ చిరకాల వాంఛ ఎస్సీ వర్గీకరణ. పేదల కష్టాలు తెలిసిన వ్యక్తిగా మోదీ వారి కల నెరవేర్చారు. కరీంనగర్‌లో పోటీ చేసే ఇద్దరు అభ్యర్థులు (కాంగ్రెస్, బీఆర్ఎస్) టోపీ పెట్టుకుని నమాజ్ చేసుకుంటారు. ఎన్నికల తరువాత మసీదు జాగాలను కబ్జా చేస్తారు. ఎన్నికల ముందు గుడికిపోయి దండం పెడతారు. ఎన్నికలయ్యాక గుడి స్థలాలను మింగేస్తరు.. పేదల ఇండ్లను కూల్చివేస్తారు. కరీంనగర్ ప్రజలంతా ఏకం కండి.. రెండుసార్లు ఓడిపోయా.. ఒక్కసారి గెలిపించండి. 5 రోజులు కష్టపడితే.. 5 ఏండ్లు మీకు సేవ చేసుకుంటా. కరీంనగర్‌కు రక్షణ కవచంగా నిలుస్తా.. మోదీ దేవుడెట్లా అవుతాడంటున్నడు కేటీఆర్.. మరి నీ అయ్య దేవుడా? ఆర్టీసీ కార్మికులు చనిపోతే బయటకు రాని మూర్ఖుడు మీ అయ్య. విద్యార్థులు, నిరుద్యోగులు చనిపోతే బయటకు రాలే.. రైతులు వడ్లకుప్పలపై పడి చనిపోతే బయటకు రాలే.. ఉద్యోగులు గుండెపగిలి చనిపోతే మీ అయ్య బయటకు రాలే.. మహిళలపై అత్యాచారాలు జరిగితే బయటకు రాలే.. పేదల బాధలు తెలిసి ఎప్పటికప్పుడు స్పందిస్తున్న ప్రధాని మోదీ నిజంగా దేవుడే. ఆయన మనలను ఆశీర్వదించడానికి మన గడ్డ పైకి వచ్చారు' అని బండి అన్నారు. కార్యక్రమంలో కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని అసెంబ్లీ అభ్యర్థులు బొడిగె శోభ, ఆరెపల్లి మోహన్, బొమ్మ శ్రీరాంచక్రవర్తి, చెన్నమనేని వికాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలు సజావుగా నిర్వహించాలి

- ఓట్ల లెక్కింపునకు సంసిద్ధంకావాలి
- కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి అనురాగ్ జయంతి



బద్దెనపల్లిలో ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి అనురాగ్ జయంతి

సిరిసిల్ల: రాజన్న సిరిసిల్ల జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాలకు నవంబర్ 30న పోలింగ్ జరుగుతుందని, డిసెంబరు 3న ఓట్ల లెక్కింపు ఉంటుందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అనురాగ్ జయంతి తెలిపారు. కలెక్టరేట్‌లో సోమవారం ఓట్ల లెక్కింపు సిబ్బందితో సమావేశమయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల నియమావళిపై రూపొందించిన మ్యానువల్‌పై అవగాహన ఏర్పరచుకొని పకడ్బందీగా పోస్టల్ బ్యాలెట్, ఈవీఎంలలోని ఓట్లను లెక్కించాలని సూచించారు. తంగళ్లపల్లి మండలం బద్దెనపల్లి గురుకులంలో ఓట్ల లెక్కింపు ఉంటుందని వివరించారు. అంతకుముందు ఎన్నికల మాస్టర్ ట్రెయినర్లు కౌంటింగ్ విధానం, ఎన్నికల సంఘం మార్గదర్శకాలను పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా కౌంటింగ్ సిబ్బందికి వివరించారు.

ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి

ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి తెలిపారు. హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్, ఇతర ముఖ్య ఎన్నికల అధికారులు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా అధికారులతో మాట్లాడారు. ఓటరు గుర్తింపు కార్డులు, ఓటరు సమాచార స్లిప్పుల పంపిణీ, డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాల ఏర్పాటు, ఈవీఎం యంత్రాల తరలింపు, కౌంటింగ్ ఏర్పాట్లపై సమీక్షించారు. ఎన్నికల ప్రచారం 28వ తేదీ సాయంత్రం 5 గంటలకు ముగుస్తుందని తెలిపారు. రిటర్నింగ్ అధికారులు సైలెన్స్ పీరియడ్‌లో పాటించాల్సిన నిబంధనలపై రాజకీయ పార్టీల ప్రతినిధులకు, అభ్యర్థులకు సమాచారం అందించాలన్నారు. ప్రచారానికి వచ్చిన స్థానికేతరులు వెళ్లేలా చూడాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ చేయాలన్నారు. విధులు నిర్వహించే పోలింగ్ సిబ్బందికి అవసరమైన ఏర్పాట్లు కల్పించాలని అన్నారు. పోలింగ్ కేంద్రాల నుంచి కౌంటింగ్ కేంద్రం, స్ట్రాంగ్‌రూమ్‌కు ఈవీఎంల తరలింపు కోసం వాహనాలు సిద్ధం చేయాలని సూచించారు.

కౌంటింగ్ కేంద్రాల పరిశీలన

తంగళ్లపల్లి మండలం బద్దెనపల్లి గురుకుల పాఠశాలలోని ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని జిల్లా ఎన్నికల అధికారి అనురాగ్ జయంతి పరిశీలించారు. సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు కేంద్రాల్లో ఈవీఎంలను భద్రపరిచే స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద సీసీ కెమెరాలతో భద్రత కల్పించాలని సూచించారు. ఓట్ల లెక్కింపు కేంద్రంలోకి ఏజెంట్లను అనుమతించడం, మీడియా సెంటర్ నిర్వహణ, ఓట్లు లెక్కించే సిబ్బందికి గుర్తింపుకార్డుల జారీ వంటి అంశాలపై చర్చించారు. అదనపు కలెక్టర్లు ఎన్.ఖీమ్యానాయక్, గౌతమ్‌రెడ్డి, రిటర్నింగ్ అధికారులు ఆనంద్‌కుమార్, మధుసూదన్, నోడల్ అధికారి పి.బి.శ్రీనివాసాచారి, పీఆర్ ఈఈ సూర్యప్రకాశ్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అధికారి శ్రీనివాస్, డీపీవో రవీందర్, డీపీఆర్వో దశరథం, కలెక్టరేట్ సెక్షన్ అధికారి శ్రీకాంత్ పాల్గొన్నారు.

బల్క్ ఎస్సెమ్మెస్‌లు పంపడం నిషేధం

జిల్లాలో ఈనెల 30న నిర్వహించే సాధారణ అసెంబ్లీ ఎన్నికలలో పోలింగ్‌కు ముందు 48 గంటల సైలెన్స్ పీరియడ్‌లో రాజకీయపరమైన బల్క్ ఎస్సెమ్మెస్‌లు పంపరాదని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అనురాగ్ జయంతి సోమవారం ప్రకటనలో తెలిపారు. బల్క్ ఎస్సెమ్మెస్‌లు పంపడం ఎన్నికల కమిషన్ నిబంధనలకు విరుద్ధమని పేర్కొన్నారు. అభ్యంతరకర మెస్సేజ్‌లు పంపితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రజలు స్వేచ్ఛగా ఓటేసేలా చూడాలి

- ఎస్పీ అఖిల్ మహాజన్



ఎల్లారెడ్డిపేటలో కేంద్ర బలగాలతో మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ప్రజలు స్వేచ్ఛగా ఓటేసేలా చర్యలు తీసుకోవాలని ఎస్పీ అఖిల్ మహాజన్ సూచించారు. ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్‌లో సోమవారం సాయుధ బలగాలతో కవాతు నిర్వహించిన అనంతరం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సమావేశమయ్యారు. ఎస్పీ మాట్లాడుతూ ఎన్నికలకు సంబంధించి కేంద్ర బలగాలు జిల్లా పోలీసులతో కలిసి భద్రత చర్యలు చేపడతారని తెలిపారు. సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లు, రూట్ బందోబస్తు, స్ట్రాంగ్‌రూమ్, కీలకమైన పాయింట్ల వద్ద కేంద్ర బలగాలను మోహరించనున్నట్లు వివరించారు. కేంద్ర బలగాలు జిల్లా పోలీస్ అధికారులతో సమన్వయం చేసుకుంటూ బందోబస్తు చర్యలను విజయవంతంగా పూర్తి చేయాలన్నారు. సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించి ఫ్లాగ్ మార్చ్, రూట్‌మార్చ్ నిర్వహిస్తూ ప్రజలకు భద్రతపై భరోసా కల్పించాలన్నారు. సిరిసిల్ల డీఎస్పీ ఉదయ్‌రెడ్డి, సీఐ శశిధర్‌రెడ్డి, ఎస్సై రమాకాంత్, బీఎస్ఎఫ్ కమాండెంట్, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై దృష్టి

తంగళ్లపల్లి(సిరిసిల్ల): సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ పేర్కొన్నారు. తంగళ్లపల్లి మండలకేంద్రంతోపాటు మండెపల్లి, ఇందిరమ్మకాలనీ పోలింగ్ కేంద్రాలను సిరిసిల్ల డీఎస్పీ ఉదయ్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. ఎవరైన చట్టవిరుద్ధంగా ప్రవర్తిస్తే చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రలోభాలకు, భయభ్రాంతులకు గురిచేస్తే సంబంధిత అధికారులకు తెలపాలని సూచించారు. సిరిసిల్ల డీఎస్పీ ఉదయ్‌రెడ్డి, తంగళ్లపల్లి ఎస్సై వి.వెంకటేశ్వర్లు ఉన్నారు.

బందోబస్తుపై సమీక్ష

వేములవాడ: అసెంబ్లీ ఎన్నికలకు వేములవాడకు వచ్చిన కేంద్ర సాయుధ బలగాలతో ఎస్పీ అఖిల్‌మహాజన్ సమావేశమయ్యారు. ప్రజలు ప్రశాంతంగా ఓటు వేసుకునేలా బందోబస్తు చేపట్టాలని సూచించారు. జిల్లా పోలీస్ అధికారులతో సమన్వయం చేసుకుంటూ ఎలాంటి గొడవలు లేకుండా ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహణకు సహకరించాలని కోరారు. జిల్లా సరిహద్దులోని చెక్‌పోస్టుల వద్ద పటిష్ఠ నిఘా ఏర్పాటు చేసి ముమ్మర తనిఖీలు నిర్వహిస్తామన్నారు. వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారి, వేములవాడటౌన్ సీఐ కరుణాకర్, ఎస్సై రమేశ్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధిని గెలిపించండి



పార్టీ కండువా కప్పుతున్న లక్ష్మీనరసింహారావు

- బీఆర్ఎస్ వేములవాడ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావు



కోనరావుపేటలో బీఆర్ఎస్ నాయకుల ప్రచారం

రుద్రంగి(వేములవాడ): ఓటర్లు ఆలోచించి.. అభివృద్ధిని గెలిపించాలని బీఆర్ఎస్ వేములవాడ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావు కోరారు. రుద్రంగి, వేములవాడ, మేడిపెల్లిల్లో సోమవారం ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. రుద్రంగిలోని ప్రహ్లాదపర్వతంపై వెలసిన శ్రీలక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న నాగవెల్లి వేడుకలకు హాజరయ్యారు. ఆలయ చైర్మన్ కొమిరె శంకర్ స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు. రుద్రంగి ఎంపీపీ గంగం స్వరూపారాణి, జెడ్పీటీసీ గట్ల మీనయ్య, సెస్ డైరెక్టర్ గంగారాం, ఏఎంసీ వైస్‌చైర్మన్ కంటి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చల్మెడ స్వగ్రామంలో ఆయన సతీమణి ప్రచారం

వేములవాడ: బీఆర్ఎస్ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనర్సింహారావుకు ఓటేసి గెలిపించాలని కోరుతూ ఆయన సతీమణి సునీల కోనరావుపేట మండలం మల్కపేటలో ప్రచారం చేశారు.

బీఆర్ఎస్‌లో చేరికలు.. ముదిరాజ్‌ల మద్దతు

బీజేపీ సీనియర్ నాయకుడు, మైనార్టీ సెల్ పట్టణ మాజీ అధ్యక్షుడు మహమ్మద్ బాబా సోమవారం బీఆర్ఎస్‌లో చేరారు. ఆయనకు చల్మెడ లక్ష్మీనర్సింహారావు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఎంపీపీ బండ మల్లేశం, నాయకులు అక్రమ్, షకీల్, షాహిద్, మధు, సంధాని ఉన్నారు. వేములవాడలోని బద్దిపోచమ్మ ప్రాంతంలోని ముదిరాజ్‌లు లక్ష్మీనరసింహారావుకు మద్దతు పలికారు. చెక్కపల్లిరోడ్డులోని పెద్దమ్మ ఆలయంలో ముదిరాజ్‌లను కలిసిన చల్మెడ ఆలయ అభివృద్ధి, సౌకర్యాల కల్పనకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

ఆలోచించి ఓటేయండి

కోనరావుపేట: అభివృద్ధి పనులు చేస్తున్న ప్రభుత్వాన్నే గెలిపించాలని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ కోరారు. కోనరావుపేట మండలం కొలనూర్, ధర్మారం, మల్కపేట, నిజామాబాద్, బావుసాయిపేటల్లో జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణతో కలిసి ప్రచారం చేశారు. మండలంలోని నిజామాబాద్‌లో బీఆర్ఎస్ మండల నాయకురాలు నేరెళ్ల జ్యోతి ప్రచారం చేశారు.

తండ్రి గెలుపు కోసం తనయ ప్రచారం

వేములవాడరూరల్/మేడిపెల్లి: బీఆర్ఎస్ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావుకు మద్దతుగా ఆయన కూతురు నిహారిక వేములవాడరూరల్ మండలం లింగంపల్లి, మేడిపల్లి, భీమారం మండలాల్లో ప్రచారం చేశారు. తుల ఉమ కోడలు తేజ శ్వినితో కలిసి గ్రామాల్లో మహిళ మద్దతు కోరారు. మేడిపల్లి ఏఎంసీ చైర్‌పర్సన్ ఉదిగిరి రమ్య, నాయకులు అంగడి ఆనంద్, నాంపెల్లి నర్సయ్య, రెబ్బాస్ మల్లయ్య పాల్గొన్నారు.

ఆదరించి ఆశీర్వదించండి

- బీజేపీ వేములవాడ అభ్యర్థి చెన్నమనేని వికాస్‌రావు

వేములవాడ: ఆదరించి.. ఆశీర్వదిస్తే వేములవాడ నియోజకవర్గ ప్రజలకు సేవ చేసుకుంటానని బీజేపీ అభ్యర్థి చెన్నమనేని వికాస్‌రావు కోరారు. వేములవాడలో పార్టీ శ్రేణులతో కలిసి సోమవారం ప్రచారం చేపట్టారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, రాపెల్లి శ్రీధర్, పిన్నింటి హన్మండ్లు, అన్నారం శ్రీనివాస్, శేఖర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

బీజేపీలో చేరిన యువకులు

వేములవాడరూరల్ మండలంలోని పలు గ్రామాలకు చెందిన యువకులు బీజేపీలో చేరారు. పార్టీ మండలాధ్యక్షుడు జక్కుల తిరుపతి, యూత్ నాయకులు తోట శేఖర్ తదితరులు ఉన్నారు.

ఇంటింటా ప్రచారం

కోనరావుపేట: మండలంలోని వట్టిమల్ల, అజ్మీరాతండా గ్రామాల్లో మాజీ జెడ్పీటీసీ పల్లం అన్నపూర్ణ, సింగిల్‌విండో డైరెక్టర్ గొట్టె మహేశ్వరీ ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మండలంలోని వెంకట్రావుపేటకు చెందిన 50 మంది యువకులు విద్యాసాగర్‌రావు సమక్షంలో బీజేపీలో చేరారు. బైరగోని సురేశ్, మిర్యాల్‌కార్ బాలాజీ తదితరులు ఉన్నారు.



బీజేపీలో చేరిన యువకులతో వికాస్‌రావు

లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్న వికాస్‌రావు



వేములవాడలో ప్రచారం చేస్తూ..

రుద్రంగి(వేములవాడ): రుద్రంగిలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి నాగవెల్లి వేడుకలకు చెన్నమనేని వికాస్‌రావు హాజరయ్యారు. ఆలయ చైర్మన్ కొమిరె శంకర్ స్వామి వారి చిత్ర పటాన్ని అందజేశారు. బీజేపీ ఓబీసీ జిల్లా అధ్యక్షుడు నంద్యాడపు వెంకటేశ్, పార్టీ మండలాధ్యక్షుడు అల్లూరి అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వారిది ధనబలం.. నాది ప్రజాబలం

- కాంగ్రెస్ వేములవాడ అభ్యర్థి ఆది శ్రీనివాస్

కోనరావుపేట(వేములవాడ): ఈ ఎన్నికల్లో ప్రత్యర్థులు డబ్బు సంచులను నమ్ముకుంటే.. తాను ప్రజలను నమ్ముకున్నానని వేములవాడ కాంగ్రెస్ అభ్యర్థి ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. ఆదరించి.. గెలిపిస్తే నియోజకవర్గ ప్రజలకు సేవ చేసుకుంటానన్నారు. కోనరావుపేట మండలం ఎగ్లాస్‌పూర్, కోనరావుపేట, శివంగాలపల్లి, మల్కపేట, ధర్మారం గ్రామాల్లో సోమవారం ఎన్నికల ప్రచారంలో పాల్గొని మాట్లాడారు. ఎన్నికల కోసం వచ్చిన వాళ్లు తర్వాత వారి ప్రాంతాలకు వెళ్లిపోతారని, తాను మాత్రం ఇక్కడే ఉంటానని స్పష్టం చేశారు. కరోనా సమయంలో ఎవరూ అందుబాటులో లేకున్నా తాను మాత్రం ఇక్కడే ఉండి.. ఆపదలో ఉన్న వారికి సాయం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. కోనరావుపేటను కోనసీమగా చేయలేదన్నారు. అబద్ధపు హామీలతో గెలిచిన ఎమ్మెల్యే పరాయి దేశంలో ఉండి పాలన సాగించారని విమర్శించారు. ఈనెల 30న చేతి గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు షేక్ ఫిరోజ్‌పాషా, కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షుడు కేతిరెడ్డి జగన్మోహన్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ గొట్టె రుక్మిణి, నాయకులు మ్యాకల ప్రభాకర్, ఎల్లయ్య, నిత్యానందం, రాస రవీందర్‌రెడ్డి, లింబయ్య, ప్రదీప్, సత్యం పాల్గొన్నారు.



కోనరావుపేటలో మాట్లాడుతున్న ఆది శ్రీనివాస్

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ నాయకుడు

మండలంలోని వెంకట్రావుపేటకు చెందిన వార్డు సభ్యుడు కుమ్మరి దయాకర్ పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఇటీవల బీఆర్ఎస్‌కు రాజీనామా చేసిన దయాకర్ హైదరాబాద్‌లో పార్టీ కండువా కప్పుకున్నారు. అజయ్, శ్రీకాంత్‌యాదవ్ తదితరులు ఉన్నారు.

కథలాపూర్‌లో..

కథలాపూర్: మండలంలోని సిరికొండ, కథలాపూర్ గ్రామాల్లో వేములవాడ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆది శ్రీనివాస్‌ను గెలిపించాలని ఆయన సతీమణి ఆది వనజ ఇంటింటా ప్రచారం చేశారు. మహిళలకు బొట్టు పెట్టి ఓటు వేయాలని కోరారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అందుతాయన్నారు.

క్లుప్తంగా

చికిత్స పొందుతూ గీతకార్మికుడు మృతి


బాలకిషన్(ఫైల్)

ముస్తాబాద్(సిరిసిల్ల): ముస్తాబాద్ మండలం మద్దికుంటకు చెందిన గీతకార్మికుడు మోతె బాలకిషన్(48) గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. ఎస్సై శేఖర్‌రెడ్డి వివరాల ప్రకారం.. ఈనెల 24న బాలకిషన్ ద్విచక్రవాహనంపై వెళ్తుండగా అదుపుతప్పి కింద పడిపోయాడు. తలకు తీవ్రగాయాలై కోమాలోకి వెళ్లాడు. గాంధీ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. బాలకిషన్ మొదటి భార్య ఆత్మహత్య చేసుకోగా, రెండో భార్య క్యాన్సర్‌తో మృతిచెందింది. వీరికి నలుగురు కూతుళ్లు ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై పేర్కొన్నారు.

సెస్ మాజీ డైరెక్టర్‌కు గాయాలు

ముస్తాబాద్(సిరిసిల్ల): ముస్తాబాద్ సెస్ మాజీ డైరెక్టర్ ఏనుగు విజయరామారావు కారు అదుపుతప్పి చెట్టుకు ఢీకొట్టింది. బీఆర్‌ఎస్ ఎన్నికల ప్రచారంలో భాగంగా గూడెం నుంచి సిరిసిల్ల వైపునకు విజయరామారావు సోమవారం కారులో వస్తుండగా, నామాపూర్ రైస్‌మిల్ వద్ద కారు అదుపుతప్పి చెట్టును ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆయనకు గాయాలు కాగా ముస్తాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. బాధితుడిని బీఆర్‌ఎస్ శ్రేణులు పరామర్శించారు.

హైదరాబాద్‌లో ప్రమాదం.. నర్సింగాపూర్‌లో విషాదం

- రెండు బైక్‌లు ఢీకొని ఒకరు మృతి.. మరొకరికి తీవ్రగాయాలు


వినయ్(ఫైల్)

చందుర్తి(వేములవాడ): హైదరాబాద్‌లోని మెహిదీపట్నంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో చందుర్తి మండలం నర్సింగాపూర్‌కు చెందిన యువకుడు మృతిచెందడం గ్రామంలో విషాదం నింపింది. గ్రామస్తుల కథనం ప్రకారం.. నర్సింగాపూర్ గ్రామానికి చెందిన వంగ దేవయ్య–జ్యోతి దంపతుల పెద్ద కుమారుడు వినయ్(21) హైదరాబాద్‌లో ప్రైవేట్ ఉద్యోగం చేసేవాడు. ఆదివారం సెలవు కావడంతో వినయ్, అతడి చిన్నాన్న కుమారుడు గణేశ్‌తో కలిసి సాయంత్రం బైక్‌పై బయటకు వెళ్లారు. ఈక్రమంలో మెహిదీపట్నంలో వీరి బైక్, మరొకరి బైక్ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈప్రమాదంలో వినయ్ అక్కడికక్కడే మృతి చెందగా, గణేశ్ తలకు బలమైన గాయాలు కావడంతో ఆసుపత్రిలో వెంటిలేటర్‌పై చిక్సిత పొందుతున్నాడు. వినయ్ మృతదేహాన్ని సోమవారం సాయంత్రం స్వగ్రామానికి తీసుకొచ్చారు. మృతదేహాన్ని చూసి బంధువులు, కుటుంబ సభ్యులు బోరున విలపించారు. చేతికి అందివచ్చిన కుమారుడి మృతితో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు.
27ఎస్‌ఆర్‌ఎల్113: ఆన్‌లైన్ సమావేశంలో పాల్గొన్న కవులు

పల్లెసంస్కృతికి ప్రతిబింబం బాలసాహిత్యం


అంతర్జాల సమావేశంలో పాల్గొన్న వక్తలు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): పల్లె సంస్కృతికి బాల సాహిత్యం ప్రతిబింబం అని తెలంగాణ వివేక రచయితల సంఘం గౌరవ అధ్యక్షుడు డాక్టర్ జనపాల శంకరయ్య పేర్కొన్నారు. మండలంలోని సింగారం గ్రామానికి చెందిన పర్శరాములు సాహితీ సమాలోచనంపై సోమవారం ఆన్‌లైన్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి అధ్యక్షుడిగా ఇమ్మడోజు మహేందర్ వ్యవహరించారు. సేవా సంస్థ అధ్యక్షుడు కంచర్ల సుబ్బానాయుడు, బోర భారతి, శోభ, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైన్స్.. ఖాళీ

- వరుస సెలవులు.. ముగిసిన లైసెన్స్
- అసెంబ్లీ ఎన్నికల ఎఫెక్ట్
- ముందస్తుగా మందు దించుకున్న పార్టీలు


ముస్తాబాద్‌లోని ఓ వైన్స్‌లో ఖాళీ అయిన ర్యాక్స్

ముస్తాబాద్(సిరిసిల్ల): రెండేళ్ల మద్యం లైసెన్స్ గడువుకు ముందే అసెంబ్లీ ఎన్నికల ఎఫెక్ట్ తగిలింది. వైన్స్ లైసెన్స్ గడువు మరో మూడు రోజుల్లో ముగియనుండగా.. ఎన్నికల పుణ్యామా అని ముందే బంద్ అవుతున్నాయి. ఇక ఎన్నికల ఎఫెక్ట్‌తో పలు రాజకీయ పార్టీలు మందును ముందుగానే దించుకున్నట్లు తెలుస్తోంది. రాజన్న సిరిసిల్ల జిల్లాలో 48 మద్యం దుకాణాల్లో 90 శాతం మందు ఖాళీ అయ్యింది. అబ్కారీ అధికారులు ఈ ఎన్నికల ముందే వైన్స్ లైసెన్స్ హోల్డర్లు చాలన్లు చెల్లించాలని అప్రమత్తం చేశారు. ఎన్నికల సందర్భంగా భారీగానే మందు విక్రయాలు జరిగాయి.

ప్రచారం గడువుతో మూతపడనున్న వైన్స్..

ఎన్నికల ప్రచారం ఈనెల 28న సాయంత్రం 5 గంటలకు ముగుస్తుంది. అప్పుడే జిల్లాలోని వైన్స్‌లను కూడా మూసివేస్తారు. ఈనెల 30న ఎన్నికలు జరగనుండగా, అదే రోజు సాయంత్రం పోలింగ్ ముగిసిన అనంతరం వైన్స్‌ను తెరుస్తారు. అయితే రెండేళ్ల లైసెన్స్ గడువు ముగుస్తుంది. ఇదిలా ఉండగా 25 నుంచి 27 వరకు వరుసగా మూడు రోజులపాటు ప్రభుత్వ సెలవులు వచ్చాయి. దీంతో వైన్స్ యజమానులు స్టాక్ కోసం చాలన్లు చెల్లించే అవకాశం లేకుండా పోయింది. ఉన్న స్టాక్‌నే 28 సాయంత్రం 5 గంటల వరకు మాత్రమే విక్రయాలు చేయాల్సి ఉంది. దీనికి తోడు 30వ తేదీతో వైన్స్ లైసెన్స్ ముగుస్తుంది. దీంతో యజమానులు స్టాక్ కోసం చాలన్లు చెల్లించే పరిస్థితి లేకుండా పోయింది. ఇవన్నీ ఇలా ఉండగా, ఎన్నికల నేపథ్యంలో పలు రాజకీయ పార్టీలు సైతం భారీగానే మద్యాన్ని కొనుగోలు చేశాయి. వరుస సెలవుల నేపథ్యంలో నిబ్, హాఫ్‌లను ముందుగానే కొనుగోళ్లు చేశారని సమాచారం. కాగా ఆది, సోమవారాల్లో వైన్స్ వద్ద ఖాళీగా ఉన్న ర్యాక్స్ చూసిన మద్యం ప్రియులు కావాల్సిన బ్రాండ్ లభించక వెనుదిరిగారు. తక్కువ స్థాయి మద్యం మాత్రం రెండు రోజుల ముందుగానే విక్రయాలు జరిగాయి.

చివరి ఆరుగంటలే..

ఈనెల 30తో వైన్స్ లైసెన్స్ ముగియనుండగా.. అదే రోజు సాయంత్రం 5 గంటలకు పోలింగ్ ముగియగానే వైన్స్‌ను ఓపెన్ చేసుకోవచ్చు. ఈ లెక్కన సాయంత్రం 5 నుంచి రాత్రి 10 గంటలకు వరకు వైన్స్‌ను తెరిచి ఉంచవచ్చు. అంటే రెండేళ్ల వైన్స్ గడువు చివరి ఆరు గంటలతో ముగియనుంది. డిసెంబర్ 1 నుంచి కొత్త లైసెన్స్‌దారులు వైన్స్‌ను ఓపెన్ చేస్తారు. చివరి ఆరుగంటలలో విక్రయాలు జరిపేందుకు మందు కూడా ఉండని పరిస్థితి నెలకొంది.

పోలింగ్ వరకు వైన్స్ బంద్

అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో వైన్స్‌ను ఈనెల 28న సాయంత్రం మూసివేయడం జరుగుతుంది. వారి లైసెన్స్ గడువు కూడా 30తో ముగుస్తుంది. డిమాండ్ ఉన్నప్పటికీ వరుస సెలవులతో కొంత మంది చాలన్లు చెల్లించలేకపోయారు. గడిచిన రెండేళ్లలో క్రితం సారికంటే జిల్లాలో అమ్మకాలు పెరిగాయి.
– పంచాక్షరీ, ఎక్సైజ్ సూపరింటెండెంట్

మద్యం విక్రయాలు బంద్

- నేటి సాయంత్రం నుంచి షాపులు మూత
- డిసెంబర్ 1 నుంచి కొత్త దుకాణాలు ప్రారంభం

సిరిసిల్లక్రైం: అసెంబ్లీ ఎన్నికల నిబంధనల ప్రకారం మంగళవారం సాయంత్రం 5 గంటల నుంచి మద్యం విక్రయాలు నిలిపివేయాలని ఆబ్కారీశాఖ ఆదేశించింది. దీనిలో భాగంగా జిల్లాలోని 42 వైన్స్‌లు, సుమారు 96 కల్లు దుకాణాలు, ఆరు బార్ అండ్ రెస్టారెంట్‌లు 48 గంటల పాటు మూతపడనున్నాయి.

డిసెంబర్ నుంచి కొత్త మందు

వైన్స్ నిర్వాహకుల రెండేళ్ల అనుమతి గడువు నవంబర్ 30వ తేదీ ముగియనుంది. డిసెంబర్ 1 నుంచి కొత్తగా అనుమతి పొందిన వ్యాపారులు దుకాణాలు ప్రారంభించనున్నారు. ఆబ్కారీ నిబంధనల ప్రకారం పాత వారి నుంచి మిగిలిన మద్యాన్ని కొనుగోలు చేసే అవకాశం లేకపోవడం, ఎన్నికల నేపథ్యంలో ఇప్పటి వరకు దుకాణాల్లో ఉన్న మందు అంతా ఖాళీ అవడంతో రెండేళ్లుగా వ్యాపారంలో ఉన్న వారు ఊపిరిపీల్చుకున్నారు. వరుసగా రెండు రోజులు సెలవులు రావడంతో వైన్స్ నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లను కొత్త వారు చేసుకుంటున్నారు.

అక్రమ నిల్వలపై నిఘా?

ఎన్నికల్లో మద్యం, డబ్బుతో ఓటర్లను ప్రలోభపెట్టేందుకు కొందరు నాయకులు వారం రోజులుగా మద్యాన్ని పెద్ద ఎత్తున కొనుగోలుకు ప్ర యత్నించినట్లు తెలిసింది. లక్షల రూపాయల మ ద్యాన్ని ఎక్కడ అక్రమంగా నిల్వ చేశారో పట్టుకో వా ల్సిన భారం ఇక పోలీసులపై ఉందని జిల్లాలో చర్చ సాగుతోంది. నిల్వల నిగ్గు తేల్చేందుకు నిఘా వ్యవస్థ ఏ మేరకు సఫలీకృతమవుతుందో వేచిచూడాల్సిందే.

‘ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న అధికారులు’


ధర్నా చేస్తున్న సురేశ్, కార్యకర్తలు

సిరిసిల్లటౌన్: ఎన్నికల వేళ జిల్లా అధికార యంత్రాంగం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసేలా ప్రవర్తిస్తుందని సిరిసిల్లలో పోటీచేస్తున్న ఏఐఎఫ్‌బీ అభ్యర్థి పత్తిపాక సురేశ్ ఆరోపించారు. సోమవారం స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో ధర్నా చేపట్టి మాట్లాడారు. తన ఎన్నికల ప్రచారానికి ఫ్లెక్సీల ఏర్పాటుకు దరఖాస్తు చేసుకుంటే కేవలం రెండ్రోజులకు గాను మున్సిపల్ పరిధిలో నాలుగు ఫ్లెక్సీల ఏర్పాటుకే అనుమతించారని పేర్కొన్నారు. కానీ మంత్రి కేటీఆర్ వస్తున్న సందర్భంగా పట్టణంలో వందలాది ఫ్లెక్సీల ఏర్పాటుకు ఎలా అనుమతించారని ప్రశ్నించారు. అభ్యర్థులందరికీ ఒకే నిబంధనలు వర్తించాలి కానీ అధికారులు మాత్రం ఇందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. ఈవిషయమై మున్సిపల్ కమిషనర్, రిటర్నింగ్ అధికారులకు ఫిర్యాదు చేసినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, ఇదేం న్యాయమన్నారు. వెంటనే అధికార పార్టీ ఫ్లెక్సీలను కూడా తొలగించాలని డిమాండ్ చేస్తూ రోడ్డుపై కార్యకర్తలతో కలిసి బైఠాయించారు. పోలీసులు చేరుకుని సముదాయించే క్రమంలో ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటు చేసుకోగా స్వల్ప ఉద్రిక్తతకు దారితీసింది. సురేశ్‌తో పాటు ఆందోళనకారులను పోలీసులు అరెస్టు చేసి ట్రాఫిక్ క్లియర్ చేశారు.

ఓటుతోనే మార్పు

సాక్షి పీపుల్స్ ఎజెండా

- మంచి పాలన రావాలంటే మంచి నాయకుడిని ఎన్నుకోవాలి
- డబ్బు, మద్యానికి ఓటును అమ్ముకోవద్దు
- నిజాయితీతో ఓటేస్తేనే మార్పు సాధ్యం
- మేధావుల అభిప్రాయం

వేములవాడఅర్బన్: మంచి పాలన కావాలంటే ప్రజలకు సేవచేస్తూ, దేశ అభివృద్ధికి నిరంతరం కృషి చేసే నాయకుడు అవసరం. అలాంటి నాయకులను ఎన్నుకోవాలంటే ఓటే వజ్రాయుధం. మనం వేసే ఓటు ద్వారానే మంచి నాయకులను ఎన్నుకునే అవకాశం ఉంటుంది. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలి. ఓటు ద్వారానే మన ప్రాంతంతోపాటు రాష్ట్ర భవిష్యత్ ఆధారపడి ఉంటుంది. ప్రజలు ఆలోచన చేసి ఓటేయాలని చెబుతున్నారు. వారి అభిప్రాయాలు వారి మాటల్లోనే..

మార్పు రావాలి



అందుబాటులో ఉంటూ, మన ప్రాంతాన్ని అభివృద్ధి చేసే నాయకుడిని ఎన్నుకోవాలి. ఉచిత పథకాలు అనేవి ఇవ్వకూడదు. రైతులకు వ్యవసాయ పనిముట్లకు సబ్సిడీ అందించాలి. విద్య, వైద్యానికి పెద్దపీట వేయాలి. మార్పు రావాలి అంటే ప్రజలు ఆలోచించి ఓటేయాలి. ఓటుతోనే మార్పు సాధ్యం.
– నక్క దివాకర్, అడ్వకేట్, వేములవాడ

సంక్షేమం కోరె నాయకుడు కావాలి



అన్ని వర్గాల ప్రజల సంక్షేమం, అభివృద్ధి, నాణ్యమైన ఉచిత విద్య, మెరుగైన వైద్యం అందించే నాయకుడు కావాలి. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలి. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికుల సమస్యలు పరిష్కరించే నాయకుడిని ఎన్నుకోవాలి. అవినీతి రహిత ప్రభుత్వం రావాలంటే ప్రజలు ఆలోచన విధానంతోనే సాధ్యం.
– ఎం.మల్లారెడ్డి, అధ్యాపకుడు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల అగ్రహారం

పనిచేసే నాయకుడికి ఓటేయాలి



ప్రజాస్వామ్యంలో ఓటు బలమైన ఆయుధం. డబ్బులకు, మందుకు అమ్ముకోవద్దు. ప్రజల్లో ఉంటూ, ప్రజల శ్రేయస్సుకు పనిచేసే నాయకుడికి ఓటేస్తే సమాజం బాగుపడుతుంది. ప్రాంతంతోపాటు రాష్ట్రం కూడా బాగుంటుంది. ప్రజలు ఆలోచన చేసి మంచి చేసే నాయకుడికే ఓటేయాలి.
– యెల్ల పోశెట్టి, వేములవాడ నృత్య కళానికేతన్ సేవాసంస్థ వ్యవస్థాపకుడు

రసవత్తరంగా ‘రాజన్న’ రాజకీయం

- టగ్ ఆఫ్ వార్‌గా ప్రచారం
- అందరి దృష్టి ఎములాడపైనే
- పురుషుల కంటే మహిళా ఓటర్లే అధికం
- జాబితాపై దృష్టిపెట్టిన నాయకులు



వేములవాడ/వేములవాడరూరల్: దక్షిణ కాశీగా పేరొందిన వేములవాడ రాజన్న నియోజకవర్గ రాజకీయం రసవత్తరంగా మారింది. ఈ నియోజకవర్గం 2009లో ఏర్పడిన నాటి నుంచి ఇప్పటివరకు ఎమ్మెల్యేగా చెన్నమనేని రమేశ్‌బాబు కొనసాగారు. ఆయనపై పోటీ చేసిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఆది శ్రీనివాస్ నాలుగుసార్లు ఓటమిపాలైనారు. ప్రస్తుత ఎన్నికల్లో కూడా బీఆర్‌ఎస్ నుంచి అదే సామాజిక వర్గానికి చెందిన నాయకుడితోనే మళ్లీ ఐదోసారి బరిలో ఆది శ్రీనివాస్ తలబడుతున్నారు. బీజేపీ అభ్యర్థిగా చెన్నమనేని వికాస్‌రావు పోటీలో ఉండడంతో రెండు ప్రధాన పార్టీల్లో పోటీలో ఉన్న ఒకే సామాజికవర్గంతో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బీసీ వర్గం నుంచి తాడోపేడో తేల్చుకోనున్నారు. కనీసం ఈ సారి అవకాశం ఇవ్వండి మీ బిడ్డగా సేవ చేస్తానని ఆది శ్రీనివాస్ ప్రచారం చేయగా, వేములవాడ నియోజకవర్గంలో అధికార పార్టీగా ఎంతో అభివృద్ధి చేశాం. మరోమారు అవకాశం ఇస్తే మరింత అభివృద్ధి చేస్తామని బీఆర్‌ఎస్ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనర్సింహారావు ప్రజలను కోరుతున్నారు. మొట్టమొదటి సారిగా బీజేపీ నుంచి చివరి నిమిషంలో టికెట్ దక్కించుకున్న మహారాష్ట్ర మాజీ గవర్నర్ విద్యాసాగర్‌రావు కుమారుడు వికాస్‌రావు ఇప్పటికే నియోజకవర్గంలో నిరుపేదలకు అండగా ఉంటూ తన వంతు సహకారం చేస్తున్నానని, ఒక్కసారి అవకాశం ఇస్తే నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని ప్రజలను కోరుతున్నారు.

పెద్ద నేతలతో ప్రచారం..

ఎన్నికల నేపథ్యంలో పార్టీల పెద్దనాయకులు వేములవాడకు వచ్చి తమ అభ్యర్థుల గెలుపు కోసం ప్రయత్నాలు సాగిస్తున్నారు. దీనిలో భాగంగా ఇప్పటికే బీఆర్‌ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ర్యాలీలు నిర్వహించారు. అలాగే బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ తమ పార్టీ అభ్యర్థి గోలి మోహన్ పక్షాన భారీ ఆశీర్వాద సభ నిర్వహించారు. ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్ బీజేపీ అభ్యర్థి వికాస్‌రావు గెలుపు కోసం బహిరంగ సభను నిర్వహించారు. అదే రోజు కాంగ్రెస్ ముఖ్యనేత రాహుల్‌గాంధీ కూడా ఆది శ్రీనివాస్ గెలుపు కోసం వచ్చి ప్రజలకు భరోసా కల్పించారు. వీరితోపాటు సీఎం కేసీఆర్ తమ పార్టీ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనర్సింహారావు కోసం సభ నిర్వహించారు. ఇలా ప్రధాన పార్టీల అభ్యర్థుల గెలుపు కోసం అగ్రనేతలు రావడంతో వేములవాడ గెలుపు కోసం జరుగుతున్న ప్రచారంపై చర్చ అధికమైంది.

అందరిదీ ఆలయ అభివృద్ధి ఎజెండా..

దక్షిణకాశీగా పేరొందిన వేములవాడ రాజన్న ఆలయాన్ని సర్వాంగ సుందరంగా మార్చుతామని అన్ని పార్టీల నాయకులు చెబుతూ ఓట్లు చేజిక్కించుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. యాదాద్రి తరహాలో అభివృద్ధి అని బీఆర్‌ఎస్, రామమందిరం మాదిరిగా అని బీజేపీ అంటుంటే తాను ఆలయ కమిటీ చైర్మన్‌గా గతంలో అభివృద్ధి చేశానని, ప్రస్తుతం గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తానని కాంగ్రెస్ చెప్పుకుంటుంది. ప్రధాన ప్రత్యర్థి పార్టీలన్నీ రాజన్న దండకాన్ని అందుకుని ముందుకుసాగడం చర్చనీయాంశంగా మారింది.

మహిళా ఓటర్లే కీలకం..

వేములవాడ నియోజకవర్గంలో మహిళా ఓటర్లే అధికంగా ఉండడంతో బరిలో నిలిచిన అభ్యర్థులు సైతం అతివలే లక్ష్యంగా ప్రచారంలో దూసుకెళ్తున్నారు. ఈ నియోజకవర్గంలో 1,03,127 మంది పురుషులు, 1,10,091 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. మహిళల ఓట్లను అత్యధికంగా పొందేందుకు ఆయా మండలాల ఇన్‌చార్జీలకు బాధ్యత అప్పగించారు. ఇప్పటికే వారంతా క్షేత్రస్థాయిలో ఇంటింటికెళ్తూ తమ నాయకుడిని గెలిపించాలని కోరుతున్నారు. కొన్ని పార్టీల నాయకులైతే ఏకంగా కానుకలు ఇస్తున్నట్లు ప్రచారంలో ఉంది.

మండలాలవారీగా మహిళా ఓటర్లు

మండలాలు	మహిళా ఓటర్లు
వేములవాడ టౌన్	27,129
వేములవాడ రూరల్	9,440
కోనరావుపేట	16,671
చందుర్తి	13,588
రుద్రంగి	4,078
కథలాపూర్	18,454
మేడిపల్లి	12,139
భీమారం	8,592
మొత్తం	1,10,091

ఎన్నికల సామగ్రి పకడ్బందీగా పంపిణీ

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అనురాగ్ జయంతి


అధికారులకు సూచనలిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్ల: ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం సామగ్రి పంపిణీ కేంద్రాలను పక్కాగా ఏర్పాటు చేయాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి అనురాగ్ జయంతి పేర్కొన్నారు. సిరిసిల్ల ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల మైదానంలో, వేములవాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎన్నికల సామగ్రి పంపిణీ ఏర్పాట్లను సోమవారం పరిశీలించి, మాట్లాడారు. ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాలలో అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా పంపిణీ కేంద్రాలు ఉండాలన్నారు. జిల్లా అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్, రిటర్నింగ్ అధికారులు ఆనంద్‌కుమార్, మధుసూదన్, సర్వే ల్యాండ్ రికార్డ్స్ అధికారి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల సామగ్రి కౌంటర్ల పరిశీలన

వేములవాడ: నిబంధనల మేరకు ఎన్నికల సామగ్రిని పంపిణీ చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అనురాగ్ జయంతి సూచించారు. వేములవాడ ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసే కౌంటర్లను సోమవారం పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాలుగా వీటిని గుర్తించినందున ఈ కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల సంఘం నిర్దేశించి సూచనలు, మార్గదర్శకాలకు అనుగుణంగా పంపిణీ కేంద్రాలు ఉండాలన్నారు. ఎన్నికల సామగ్రిని తరలించే వాహనాలు, సిబ్బంది వాహనాలు సులభంగా వచ్చి వెళ్లేలా సరైన పార్కింగ్ ఏర్పాటు చేయాలన్నారు. జిల్లా అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్, రిటర్నింగ్ అధికారి మధుసూదన్, సర్వే ల్యాండ్ రికార్డ్స్ అధికారి శ్రీనివాస్ ఉన్నారు.

నేతన్నల ఆత్మహత్యలపై స్పందించని సర్కార్

- బీసీ రాజ్యాధికార సమితి రాష్ట్ర అధ్యక్షుడు సురేశ్


మాట్లాడుతున్న సురేశ్

సిరిసిల్లటౌన్: కరీంనగర్ జిల్లా చొప్పదండిలో ఒకే రోజున ముగ్గురు నేతకార్మికులు ఆత్మహత్య చేసుకుంటే బీఆర్‌ఎస్ సర్కారు స్పందించకపోవడం బాధాకరమని బీసీ రాజ్యాధికార సమితి రాష్ట్ర అధ్యక్షుడు దాసు సురేశ్ అన్నారు. ఇన్నేళ్లుగా ఆత్మహత్యలకు పాల్పడిన నేతన్నల కుటుంబాలకు చెందిన పలువురు మహిళలతో కలిసి సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత పదేళ్లుగా సుమారు 400 మంది నేతకార్మికులు బలవన్మరణాలకు పాల్పడ్డారన్నారు. ఇక చేనేత శాఖ మంత్రిగా ఉన్న కే. తారకరామారావు సిరిసిల్లలోని నేతన్నలను బతుకమ్మ చీరల ముసుగులో మోసం చేస్తూ, పట్టుచీరల కాంట్రాక్టులను పక్క రాష్ట్రాల్లోని తన అనుయాయులకు ఇచ్చారని ఆరోపించారు. సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించకుండా పదేళ్లుగా పద్మశాలీల నాయకత్వాన్ని నిర్వీర్యం చేశారన్నారు. టెస్కో షోరూంలను ప్రారంభించాల్సిన మంత్రి కార్పొరేట్ షాపింగ్‌మాల్స్‌ను ప్రారంభించడం ఏంటని ప్రశ్నించారు. కేటీఆర్ తన స్వార్థానికి చేనేతలను తాకట్టు పెడుతున్నారని విమర్శించారు. అంతకుముందు కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో బాధిత మహిళలు శ్యామల, సుమతి, సంధ్య, కోమలి, మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

రాజన్నకు కార్తీకశోభ

వేములవాడ/సిరిసిల్లటౌన్: కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని సోమవారం రాజన్నను 30 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. ఆలయ ఆవరణం భక్తులతో కిటకిటలాడింది. భక్తుల ద్వారా రూ.40 లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఏర్పాట్లను ఈవో కృష్ణప్రసాద్, ఏఈవోలు శ్రీనివాస్, ప్రతాప నవీన్, జయకుమారి పరిశీలించారు. హైకోర్టు జడ్జి సుజన కుటుంబ సభ్యులతో కలసి సోమవారం రాజన్నను దర్శించుకున్నారు. ఆలయ ఈవో కృష్ణప్రసాద్, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. జగిత్యాల జిల్లా ఎన్నికల పరిశీలకులు రాజీవ్ రంజన్, బసవ రాజేంద్ర, వివేకానంద్‌సింగ్ రాజన్నను దర్శించుకున్నారు. ఈవో కృష్ణప్రసాద్ స్వామి వారి లడ్డు ప్రసాదం అందజేశారు.


కోడె మొక్కు చెల్లించుకుంటున్న హైకోర్టు జడ్జి సుజన కుటుంబ సభ్యులు


కోడె మొక్కు చెల్లించుకుంటున్న భక్తులు


ఆలయ ఆవరణలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు


సిరిసిల్ల విశ్వనాథస్వామి ఆలయంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు


సిరిసిల్ల శివనగర్ శివాలయంలో..